సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇంకొన్ని రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా చనిపోయాడు. - IIలో



తీరం.. పర్యాటక హారం

జిల్లాలో తీర ప్రాంతాలు కొత్త అందాలు సంతరించుకుంటున్నాయి. పర్యాటక ప్రాంతాలుగా మారుతున్నాయి. - IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర	శని
సాయంత్రం	ఉదయం
6.12	4.30

న్యూస్‌రీల్

స్పృహ తప్పిన వృద్ధుడు



ఈయన పేరు చాప కరువయ్య. వయస్సు 76 ఏళ్లు. నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీ కామధేనువు గ్రామం. ఇక్కడి నుంచి కిలోమీటరున్నర దూరంలో ఉన్న దేవుపురం సచివాలయానికి నేరుగా ఆటోలు లేవు. లట్టిగాం వద్ద ఆటో ఎక్కి దేవుపురం బస్టాండ్‌లో దిగి కిలోమీటరు నడవాలి. తొందరగా పింఛన్ తీసుకోవాలనే ఆశతో కరువయ్య సచివాలయానికి బయల్దేరారు. కానీ ఎండ ధాటికి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయారు. ఆ మార్గాన వెళ్తున్న వలంటీర్ సాలిన ధనుంజయ తక్షణం స్పందించి వృద్ధునికి సపర్యలు చేసి సచివాలయానికి పంపించాడు. ఈ వయసులో ఇంత ఎండలో తమబోటి వారిని ఇలా నడిపించడం సబబు కాదని కరువయ్య అన్నారు. తమలాంటి వృద్ధుల శాపం చంద్రబాబుకు తగలకుండాపోదని శాపనార్థాలు పెట్టారు. - నందిగాం

ప్రత్యేక బీఎడ్‌లో తక్షణ ప్రవేశాలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక బీఎడ్ (మెంటల్లీ రిటార్డ్) కోర్సుల్లో ఈ నెల 6వ తేదీన తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు రెక్టార్ బి.అడ్డయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా విభాగంలో నిర్వహించే ఈ ప్రవేశాలకు ఎడ్‌సెట్ - 2023 ర్యాంకు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. టీసీ, ఎడ్‌సెట్ ర్యాంకు కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్ పోర్టు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. రెండేళ్ల కోర్సులో ఏడాదికి రూ.16,400 ఫీజు స్ట్రక్చర్‌గా చెప్పారు.

బ్యాంకులో ఆడిట్ పూర్తి

నరసన్నపేట: స్థానిక బజారు స్టేట్ బ్యాంకులో ఆడిట్ పూర్తయ్యింది. నాలుగు రోజులుగా ఆమదాలవలస చీఫ్ మేనేజర్ ఆధ్వర్యంలో ఈ అంతర్గత ఆడిట్ జరుగుతున్న విషయం విదితమే. బుధవారంతో ఆడిట్ పూర్తయ్యింది. అయితే దీనిపై వివరాలు వెల్లడించేందుకు బ్యాంకు సిబ్బంది నోరు మెదపడం లేదు. మేనేజర్ శ్రీకర్ పాత పాటే పాడుతున్నారు. పది రోజుల క్రితం బ్యాంకు సిబ్బంది రూ. 65 లక్షలు బ్యాంకుకు కట్టినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం నకిలీ ఖాతాలకు సంబంధించినదా.. మరే మొత్తమా అనేది తెలియడం లేదు.

అనధికార మద్యం విక్రయాలపై నిఘా



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ జేడీ గంగాధరం

కోటబొమ్మాళి: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గాను జిల్లా వ్యాప్తంగా అనధికార మద్యం విక్రయాలపై నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం అన్నారు. ఆయన గురువారం కోటబొమ్మాళి ఎస్ఈబీ స్టేషన్ సిబ్బందితో సమీక్షించారు. జేడీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను పక్కాగా పాటించాలన్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు.

నేటి నుంచి అభయహస్తం పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ అభయ హస్తం పింఛన్లను శుక్రవారం నుంచి లబ్ధిదారులకు అందజేయనున్నారు. గడిచిన రెండు రోజులుగా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సచివాలయాల్లో జరుగుతోంది. ఈ సారి అభయహస్తం పింఛన్లను కూడా వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా శుక్రవారం నుంచి అందజేయనున్నారు. జిల్లాలో ఉన్న 13,705 మంది అభయ హస్తం లబ్ధిదారులకు రూ.500లు వంతున అందజేయనున్నారు.

ఇండియాకు ఇరవయ్యో సారి



పలాస జాతీయ రహదారిపై ఫ్రాన్స్ దేశస్తులు

కాశీబుగ్గ: భారత దేశమంటే తమకు చాలా ఇష్టమని, ఇరవయ్యో సారి వస్తున్నామని, దేశం చాలా మారిపోయిందని ఫ్రాన్స్‌కు చెందిన యన్నా అలియాన్, ఫెన్‌షాన్ అలియాన్ అనే ఇద్దరు విదేశీ యాత్రికులు అన్నారు. కోల్‌కతా నుంచి చెన్నైకు సైకిల్‌పై వెళ్తూ పలాస జాతీయ రహదారిపై ఇలా కనిపించారు.

నడకయాతన పడ్డాం బాబూ



వీరి కష్టం చూడండి. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం పంచాయతీలో సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి పింఛన్ తీసుకుని తిరిగి వెళ్లేందుకు పడుతున్న అవస్థలివి.

కొందరు ఎక్కడో గిరిశిఖర గ్రామంపై ఉంటారు. వారంతా పింఛన్ కోసం ఎర్రటి ఎండలో నాలుగైదు కిలోమీటర్లు సచివాలయం వద్దకు నడిచారు. ఇంకొందరు ఎక్కడో మారుమూల గ్రామంలో ఉంటారు. తొందరగా పింఛన్ అందుకోవాలనే ఆశతో ఆపసోపాలు పడి పక్క ఊళ్లలోని సచివాలయాలకు పరుగులు పెట్టారు. మరికొందరు మంచంపై దిగలేని దీనస్థితిలో ఉన్నారు. వలంటీర్ లేకపోవడంతో తమ వద్దకు ఎవరు వస్తారో, తాము ఎవరి వద్దకు వెళ్లాలో తెలీక యాతన అనుభవిస్తున్నారు. పింఛన్ చాలా మంది బతుకులకు ఆధారం. ఈ డబ్బునే మందులు, ఇతర అవసరాలకు వాడుకోవడం అలవాటైపోయింది. వలంటీర్లు లేక, స్పష్టమైన సమాచారం తెలియక వారంతా అవస్థ పడుతున్నారు. సచివాలయం వద్ద కనిపించే ప్రతి లబ్ధిదారుడి ముఖంలో ఈ ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

- వృద్ధులు, దివ్యాంగుల ఆవేదన
- ఎండల్లో నడవలేక అవస్థలు
- ఆదుకున్న సచివాలయ వ్యవస్థ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

చంద్రబాబు అండ్ కో చేసిన నీచ రాజకీయానికి వృద్ధులు, దివ్యాంగులు నరకయాతన అనుభవిస్తున్నారు. యాతనే కాదు గురువారం జిల్లాలో ఏకంగా ముగ్గురు ప్రాణాలు వదిలేశారు. కోటబొమ్మాళి వద్ద అయితే తోపులాటే జరిగింది. చంద్రబాబు హయాంలో జరిగిన రాక్షస పాలన గుర్తు చేసుకుని, నేడు జరుగుతున్న పరిణామాలను చూసి భయపడిపోతున్నారు. పింఛన్ల కోసం పండుటాకులు పడుతున్న కష్టం చూస్తే అయ్యో పాపం అనక మానదు. ఒకప్పుడు చంద్రబాబు పాలనలో పింఛన్ అందుకోవాలంటే నానా కష్టాలు పడాల్సి వచ్చేది. పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. వృద్ధులు అనే కనికరం లేకుండా అప్పట్లో ఇబ్బందులు పెట్టారు. పింఛన్ డబ్బు కోసం వచ్చిన పలువురు అప్పట్లో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఇబ్బందులన్నీ వైఎస్ జగన్ తొలగించేశారు. వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి లబ్ధిదారులకు మేలు చేశారు. కానీ ఎన్నికలను అడ్డుపెట్టుకుని చంద్రబాబు మళ్లీ తన పన్నాగం పన్నారు. బాబు కుటిల బుద్ధి కారణంగా వలంటీర్ల సేవలు నేడు అందకుండాపోయాయి.

ఎన్నికల సాకుగా కుట్రలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకముందే ఇంటి తలుపు తట్టి వలంటీర్లు అవ్వాతాతలకు, దివ్యాంగులకు పింఛన్లు అందజేసేవారు. కానీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో దీన్ని సాకుగా చూపి టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుయాయుల చేత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. ఫలితంగా పింఛన్ల పంపిణీకి వలంటీర్లు దూరంగా పెట్టాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇది వృద్ధుల పాలిట శాపంగా పరిణమించింది.



ఇచ్ఛాపురం రూరల్: పింఛన్ కోసం దివ్యాంగురాలిని మోసుకువస్తున్న దృశ్యం



టెక్కలి రూరల్: మేఘవరం సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

● ఎలా వెళ్లాలి..



ఈమె పేరు లొట్టి లక్ష్మీనరసమ్మ. హిరమండలం మేజర్ పంచాయతీలోని చిన్నకోరాడ ఈమెది. ఎనిమిది పదుల వయసులో వయోభారంతో బాధపడుతున్నారు. మంచాన పడడంతో కుటుంబ సభ్యులు నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీరు పింఛన్ అందించేవాడు. కానీ ఈ నెల మాత్రం ఇంతవరకూ పింఛన్ అందలేదు. పింఛన్ కావాలంటే సచివాలయానికి రావాలంటున్నారు. అడుగు తీసి అడుగు వేయలేని ఈ వృద్ధురాలు ఈ కష్టం తెచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - హిరమండలం

● పాపం రత్నాలు..



ఈ గిరిజన వృద్ధురాలిది మందస మండలంలోని టంగరాపుట్టి పంచాయతీ రాయికోల గ్రామం. పేరు సవర రత్నాలు. తమ గ్రా మం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండలోగాం సచివాలయానికి మండుటెండలో బయల్దేరింది. కిలో మీటరు నడిచాక ఆయాస పడుతూ చతికిలపడింది. సర్పంచ్ సవర నవితకు విషయం తెలియడంతో ప్రాథమిక చికిత్స చేయించారు. సచివాలయం సిబ్బంది పరిస్థితి తెలియజేసి, ఇంటి వద్దకు పింఛను తెచ్చి ఇవ్వాలని కోరారు. ఇక్కడ చాలా గిరిజన గ్రామాల్లో ఇదే పరిస్థితి. గత నెల వరకు వలంటీర్ ఇంటికే తెచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఈ కష్టం ఉండేది కాదు. - మందస

తప్పును కప్పిపుచ్చుకుని ఎదురుదాడి

వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించొద్దని తన అనుయాయులతో ఎన్నికల సంఘానికి చంద్రబాబే ఫిర్యాదు చేయించారు. తాము ఫిర్యాదు చేయడం వల్లనే ఎన్నికల సంఘం వలంటీర్లపై ఆంక్షలు పెట్టిందని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా ప్రకటించారు. కానీ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల నుంచి తీవ్ర ప్రతిఘటన, వ్యతిరేకత వ్యక్తం కావడంతో యూటర్న్ తీసుకుని ఇదంతా వైఎస్ జగన్ ప్రభుత్వం తప్పిదమని ఎదురుదాడి చేస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థపై సవతి ప్రేమ చూపిస్తూ మాట్లాడుతున్నారు. తప్పు చేసి మరీ బుకాయిస్తున్నారు.



శ్రీకాకుళంలో ఓ వృద్ధురాలి అవస్థ

● చంద్రబాబు కుట్రకు చెక్

వలంటీర్లతో ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేయ లేని పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేపట్టింది. సచివాలయం వద్ద టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేసి, కాస్త సేదతీరేలా చేసి, వచ్చిన వారందరికీ చకచకా పింఛన్లు పంపిణీ జరిగేలా చేసింది. రెండో రోజు నాటికి జిల్లాలోని 3,21,689 పింఛన్లకు గాను 2,76,740 మందికి పింఛన్ల పంపిణీ పూర్తి చేసింది. 86.03 శాతం పంపిణీ జరిగిపోయింది. ఇంకా 44,949 మంది మిగిలిపోయారు. వీరిలో దివ్యాంగులు ఎక్కువగా ఉన్నారు.



భగభగ మండే ఎండలో కాలినడకన వెళ్తున్న వీరంతా మందస మండలం గిరిజన గ్రామం పింఛన్‌దారులు. గత నెల వరకు ఇంటి వద్దనే పింఛన్ అందేది. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబు పన్నిన పన్నాగంతో నేడు ఆ సౌకర్యం రద్దయింది. దీంతో ఇదిగో ఇలా పింఛన్ డబ్బు కోసం తమ గ్రామం నుంచి కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది.

● వడదెబ్బకు దివ్యాంగుడు మృతి



బినోదిని పాణిగ్రాహి (ఫైల్)

మెళియాపుట్టి : మండలంలోని రట్టిణి గ్రామానికి చెందిన బినోదిని పాణిగ్రాహి (68) గురువారం పెన్షన్ తీసుకోవడానికి వెళ్లి వడదెబ్బకు గురై మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రట్టిణి గ్రామం నుంచి వసుంధర సచివాలయానికి ఉదయం 10 గంటల సమయంలో పెన్షన్ తీసుకోవడానికి ఆయన వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఒడిశా సరిహద్దు(దవిడిగాం- సీతాపురం) సమీపంలోని చెరువు వద్ద మృతదేహాన్ని గుర్తించారు. దివ్యాంగుడు కావడంతో దారితప్పి అటుగా వెళ్లి ఉండొచ్చని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతునికి వివాహం కాలేదు, సోదరుడి ఇంటి వద్దే ఉంటున్నట్లు తెలిపారు.

‘తండ్రిని కాపాడుకోలేకపోయా..’



ప్రతి నెలా మా నాన్నకు ఇంటికే పెన్షన్ వచ్చేది. సచివాలయానికి ఈ ఎండలో వెళ్లాల్సి రావడంతోనే ఆయన ప్రాణం పోయింది. పింఛన్ కోసం ఈ ఎండలో రెండు రోజులు తిరిగారు. బయోమెట్రిక్‌లో వేలి ముద్రలు పడకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. నేను వలంటీర్‌గా పనిచేశాను. గత నెల వరకు ఎందరికో ఒకటో తేదీన పింఛన్లు ఇచ్చాను. ఇప్పుడు నా కన్నతండ్రిని కూడా కాపాడుకోలేకపోయాను. - లూథియా, చనిపోయిన శిర్ల ప్రకాశరావు కుమార్తె, వలంటీర్

రాజుకుంటోంది..!



- ఎస్‌బీఐ బ్రాంచుల్లో వెలుగు చూస్తున్న స్కామ్‌లు
- మొన్న గార, నేడు నరసన్నపేట
- ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో వ్యక్తిగత రుణాల వాడకం
- రెండు ఘటనల్లోనూ రీజినల్ మేనేజర్ తీరుపై అనుమానాలు
- హుటాహుటిన బదిలీ చేసిన ఎస్‌బీఐ ఉన్నతాధికారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లాలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచుల్లో వరుస స్కామ్‌లు బయటపడుతున్నాయి. గార ఎస్‌బీఐలో తనఖా బంగారం మాయం కేసు మరువక ముందే జిల్లాలోని మరో కుంభకోణానికి ఎస్‌బీఐ కేంద్రబిందువుగా మారింది. నరసన్నపేట బజారు బ్రాంచిలో సుమారు రూ. 3 కోట్ల వరకు అవినీతి జరగడం చర్చనీయాంశంగా మారంది. వందమందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు తెలియకుండా బ్యాంకు అధికారులే వారి పేరిట వ్యక్తిగత రుణాలు తీసుకున్నట్లు విచారణలో తేలినట్టు సమాచారం. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో జరుగుతున్న వరుస కుంభకోణాల్లో మొదటి నుంచి రీజనల్ మేనేజర్ తోటకూర రమణమూర్తిరాజు పాత్రపై అనేక అనుమానాలున్నా బయటపడలేదు. కానీ నరసన్నపేట బ్రాంచి మేనేజర్‌పై ఆరోపణలు చేయడం, ఆయన మంగళవారం ఉదయం బ్రాంచి కార్యాలయంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం, బ్యాంకు విజిలెన్సు విభాగం తరపున విచారణ చేయడంతో అసలు విషయాలన్నీ బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో రీజినల్ మేనేజర్ తోటకూర రమణమూర్తిరాజును రాత్రికి రాత్రే విధుల నుంచి తప్పించడంతో ఇప్పుడన్ని వేళ్లు ఆయననే చూపుతున్నాయి.

రమణమూర్తిరాజు పాత్రపైనే అనుమానాలు

శ్రీకాకుళం రీజినల్ మేనేజర్‌గా ఉన్న రమణమూర్తిరాజు పాత్రపైనే సర్వత్రా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆయన పరిధిలోని రెండు బ్రాంచ్‌ల్లో అక్రమాలు బయటికిరావడంతో అందరి దృష్టి ఆయనపైనే పడింది. దానికి తోడు ఆయనకు వేర్వేరు పెద్ద వ్యక్తులతో సంబంధాలుండటం, ఓ మహిళా ఉద్యోగితో సత్సంబంధాలు నెరపడం, తనకు నచ్చని, చెప్పినట్టు చేయని వ్యక్తులపై వేటు వేయడం, రుణాల ఇచ్చే విషయంలో చేతివాటం ప్రదర్శించడం, సూట్ కేసు కంపెనీల పేరిట రుణాలు ఇప్పించడం వంటి వాటిపై కూడా గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తోంది. ఈ సమయంలోనే ఆయన్ని హుటాహుటిన బదిలీ చేయడం, ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా గాలిలో పెట్టడం, వారిపై పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తారన్న వార్తలు బయటికి రావడంతో రమణమూర్తి రాజు కీలకమైన వ్యక్తి కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్నెన్నో సందేహాలు

- గార ఎస్‌బీఐ కేసులో ఏ-1 ముద్దాయిగా పేర్కొన్న స్వప్నప్రియ 2023 అక్టోబరు నెలకు సంబంధించి బంగారు సంచులను మాయం చేసినట్లు ఉండే సీసీ ఫుటేజీనే ఆర్‌ఎం రాజు పోలీసులకు ఇచ్చారు. కానీ అంతకుముందు నెలే (సెప్టెంబరు) బ్రాంచిలో సెంట్రల్ ఆడిట్ జరిగింది. అందులో ఎలాంటి తేడా లేనట్లు క్లియర్‌గా ఉన్నట్లు చూపించారు. వాస్తవానికి పోలీసుల విచారణలో 14 నెలలుగా స్వప్నప్రియ ద్వారా ఈ తతంగం జరిగినట్లు చెప్పారు. అలాంటప్పుడు సెప్టెంబరులో జరిగిన సెంట్రల్ ఆడిట్‌లో ఈ అవకతవకలు బయటపడలేదా అన్నది అనుమానం.
- మొత్తం బ్యాగులన్నీ మార్చింది స్వప్నప్రియే అన్నట్లు చూపించారు. క్యాషియర్ పాత్ర లేకుండా సాధ్యమా.. ఉదంతం జరిగే సమయంలో క్యాషియర్ సురేష్‌ను ఆర్‌ఎం రాజు మూడు చోట్ల పోస్టుల్లో (గార, ఎచ్చెర్ల బ్రాంచిల్లో క్యాష్ ఆఫీసర్‌గాను, శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో క్యాష్ మేనేజ్‌మెంట్ కాలర్‌గాను) ఉంచారు. అంతే కాకుండా క్యాషియర్ సురేష్‌పై స్వప్నప్రియకు సంబంధించిన వారే దాడి చేశారంటూ అంతకుముందే గార పీఎస్‌లో కేసు నమోదు చేయడం, అది ఫేక్ అని తేలడం కూడా జరిగాయి. పోలీసులకు చివరి వరకు దొరకనిది క్యాషియర్ సురేషే. అదీ లాయర్ ద్వారా యాంటిసిపేటరి బెయిల్ తెచ్చుకుంటూ లొంగిపోయాడు.
- పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఓ నిందితుడైన లోహితాక్షి కన్సల్టెన్సీ తిరుమలరావు రూ. 1.70 కోట్ల వరకు ప్రస్తుతం నరసన్నపేట కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న చింతాడ శ్రీనివాసరావు కుటుంబ ఖాతాలకు మళ్లించినట్టు చెప్పినట్టు సమాచారం. మరో రూ.1 కోటి వరకు మరో బ్రాంచి మేనేజరుగా ఖాతాకు వెళ్లినట్టు చెప్పారు. దీని వెనక ఆర్‌ఎం పాత్ర ఉందనే అనుమానం ఉంది.
- మాయమయ్యాయన్న 86 బ్యాగుల్లో 26 బ్యాగులను ఆరోపణలు ఎదుర్కొన్న స్వప్నప్రియ తరఫున నవంబరు 27, 28 తేదీల్లో కిరణ్, తిరుమలరావు, మరో వ్యక్తి కలిసి సంతోషిమాత కన్సల్టెన్సీ, ఇతర బ్యాంకుల నుంచి తెచ్చి అప్పగించారు. ఆ సమయంలో ఆర్‌ఎం కూడా వారితో పాటే ఉన్నట్లు సీసీ ఫుటేజీలో నిక్షిప్తమై ఉంది. కానీ 27న కిరణ్ బంగారాన్ని తెచ్చినప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేయకుండా 29 స్వప్నప్రియ చనిపోయాక 30న ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.
- పోలీసులు కేసు విచారిస్తున్న సమయంలోనే గార బ్రాంచిలో పనిచేస్తున్న సిబ్బందిని అంతా ఒకేసారి ఆర్‌ఎం బదిలీ చేశారు. అది రూల్స్‌కు విరుద్ధం. కేసు పెట్టాల్సింది స్థానికంగా ఉన్న బ్రాంచి మేనేజరే తప్ప ఆర్‌ఎంకు సంబంధం లేదు. కానీ ఆయనే డైరెక్ట్‌గా కేసు పెట్టారు.

గారలో అలా..

గార ఎస్‌బీఐలో ఖాతాదారులు పెట్టిన బంగారాన్ని భద్రంగా ఉంచాల్సిందిపోయి వాటిని తీసుకెళ్లి కొందరు ఉద్యోగులు ఓ ప్రైవేటు సంస్థలో కుదవ పెట్టి కోట్ల రూపాయలు తీసుకుని సొంతానికి వాడుకున్నారు. దాదాపు 86 సంచుల్లోని రూ. 4.7కోట్ల విలువైన 7.146 కిలోలకు పైగా బంగారు ఆభరణాలు ఈ రకంగా పక్కదారి పట్టాయి. బ్యాంకు స్ట్రాంగ్ రూమ్‌ల్లోని సేఫ్‌లో భద్రంగా ఉంచాల్సిన ఆ బంగారు ఆభరణాల్లో కొన్నింటిని తిరిగి ఓ ప్రైవేటు కన్సల్టెన్సీ వద్ద పెట్టి మారు లోన్ తీసుకున్నట్టుగా విచారణలో కూడా తేలింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొన్న బ్యాంకు ఉద్యోగి స్వప్నప్రియ విచారణకు ముందే ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె బతికున్నప్పుడు పక్కదారి పట్టిన బంగారానికి సంబంధించిన 26 సంచుల విషయం బయటికి పొక్కగానే బ్యాంకుకు అప్పగించారు. వ్యవహారం ముదిరి పాకాన పడటంతో కొందరు ఉద్యోగులను సస్పెండ్ కూడా చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి విచారణ చేపట్టాక నిందితులను వెంట బెట్టుకుని మిగతా 60సంచులను వివిధ ప్రైవేటు సంస్థల నుంచి రికవరీ చేశారు.

నరసన్నపేటలో ఇలా..

తాజాగా నరసన్నపేట ఎస్‌బీఐలో ప్రభుత్వ ఉద్యో గుల పేరిట బ్యాంకు సిబ్బందే వ్యక్తిగత రుణాలు తీసుకుని, దాదాపు రూ.3కోట్ల వరకు తమ జేబుల్లో వేసుకున్నట్టు బయటకు వచ్చింది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు వివిధ అవసరాల కోసం వ్యక్తిగత రుణాలు కావాలని బ్యాంకుల్ని ఆశ్రయిస్తారు. ఇవ్వాలా? ఇవ్వకూడదా? అన్నది బ్యాంకులే తుది నిర్ణయం తీసుకుంటాయి. కానీ, ఇక్కడ బ్రాంచ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల నుంచి అన్ని డాక్యుమెంట్లు తీసుకుని రుణాలు ఇవ్వడం కుదరదని చివరి నిమిషంలో తేల్చి చెప్పేసి, ఆ డాక్యుమెంట్లనే బ్యాంకులో పెట్టి ఆ ఉద్యోగుల పేరుతో బ్యాంకు ఉద్యోగులే వ్యక్తిగత రుణాలు తీసుకున్నట్టుగా సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో ఫీల్డ్ ఆఫీసర్ చింతాడ శ్రీనివాసరావు పాత్ర ప్రధానంగా ఉండగా, దాని వెనక రీజినల్ మేనేజర్‌గా పనిచేసిన రమణమూర్తిరాజు ఉన్నట్టు ప్రచారంలోకి వచ్చింది. కానీ, జరిగిన తప్పిదానికి అక్కడ బ్రాంచి మేనేజర్‌నే బాధ్యుడిని చేయాలనే కుట్రలు జరగ్గా, ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో వ్యవహారం వెలుగులోకి వచ్చినట్టు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి.

ఉద్దానంలో మరో ఎలుగు కలకలం



మెట్టూరులో రాత్రి సమయంలో సంచరిస్తున్న భల్లూకం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం ప్రాంతంలో గల మెట్టూరులో మరో ఎలుగు బుధవారం రాత్రి కలకలం రేపింది. అదే గ్రామంలో మంగళవారం ఎలుగు కలకలం సృష్టిస్తూ పాతబడిన ఇంటిలోకి ప్రవేశించడంతో అటవీశాఖాధికారులు బంధించి విశాఖపట్నం జూకి తరలించారు. ఆ సంఘటన మరువక ముందే మరో భల్లూకం గ్రామంలో హల్‌చల్ చేసింది. రాత్రి సమయంలో గ్రామ వీధుల్లో సంచరించడంతో ఎలుగును చూసిన స్థానికులు ప్రాణభయంలో ఇళ్లలోకి పరుగులు తీశారు. గ్రామంలో కొద్దిసేపు తిరిగిన ఎలుగు నెమ్మదిగా పరిసర జీడి తోటల్లోకి జారుకుంది. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు గురువారం గ్రామానికి చేరుకొని ఎలుగు సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. జీడి తోటకు వెళ్లేటప్పుడు ఒంటరిగా వెళ్లరాదని సూచించారు.

17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

టెక్కలి రూరల్: గత నెల 30వ తేదీన టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఓ టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని దొంగిలించారు. ఆస్పత్రిలోని సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసిన టెక్కలి పోలీసులు విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు వారిని విచారించి వారి వద్ద నుంచి సుమారు 17 టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాలను గురువారం స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సోమేశ్వరరావు

సారవకోట: మండలంలోని బొంతు జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరిగుంట పంచాయతీ బొంగాడిపేట గ్రామానికి చెందిన సోమేశ్వరరావు తీవ్ర గాయాలపాలయ్యారు. నౌతళ నుంచి సారవకోట వైపు బైక్‌పై వెళ్తుండగా బొంతు సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డుకు బలంగా ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను 108 వాహనంలో నరసన్నపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది హరికృష్ణ తెలిపారు.

తాగునీటి గుంతలో పడి ఆవు మృతి

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో తాగునీరు అందించేందుకు రోడ్డు పక్కన తవ్విన తాగునీటి గుంత (ఎయిర్ హోల్)లో పడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన టికేటి ఉమామహేశ్వరావు ఆవును గురువారం మేతకు విడిచి పెట్టారు. గ్రామంలోని మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి రోడ్డు పక్కన పైపులైన్లు వేశారు. ఈ పైపులైన్‌కు సంబంధించి ఎయిర్ హోల్‌గా గుంతను తవ్వి సిమ్మెంటుతో కట్టడం కట్టి విడిచిపెట్టారు. దీంతో మేతకు వచ్చిన ఆవు ఎయిర్ హోల్‌లో పడి మృతి చెందిందని బాధితునితో పాటు గ్రామస్తులు చెబుతున్నారు. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి ఎయిర్ హోల్‌పై మూత వేయాలని కోరుతున్నారు.

వడివడిగా కలివిడిగా..



ఆమదాలవలస రూరల్: దిబ్బలపేట గ్రామంలో స్పీకర్ తమ్మినేని సీతారాంకు తిలకం దిద్దుతున్న మహిళ



మెళియాపుట్టి: నందవ గ్రామంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



టెక్కలి: ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్



నరసన్నపేట: కోమర్తి కూడలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



జి.సిగడాం: సంతవురిటిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



సోంపేట: బారువ మేజర్ పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద

సార్వత్రిక సమరంలో నాయకులు ప్రచార వేగం పెంచారు. వడివడిగా అడుగులు వేస్తూ జనంతో కలివిడిగా కలిసిపోతున్నారు. జనం కూడా అభిమాన నాయకులకు హారతులిస్తూ విజయ తిలకాలు దిద్దుతున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గిరిజనులు



ఉద్దానం నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మందస: మండలంలోని బుడారిసింగి, టంగరపుట్టి పంచాయతీలకు చెందిన పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో బుడారిసింగి పంచాయతీకి చెందిన సవర కుందన, పాలక సింహాచలం, బొకిడి చంద్రో, సవర అభి తదితర 15 మంది పార్టీలో చేరినవారిలో ఉన్నారు. అదేవిధంగా టంగరపుట్టి పంచాయతీకి చెందిన జీవన్‌బాబు, కూర్మయ్య, డొంబురు, చిన్నారావు, తదితర 20 మంది పార్టీలో చేరారు.

ఉద్దానం నుంచి...

ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు తిమ్మల లక్ష్మీనారాయణ, గిరి, బొడ్డు రామారావులతో పాటు సుమారు 10 మంది పార్టీలో చేరారు. వీరిని మంత్రి అప్పలరాజు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, బుడారిసింగి సర్పంచ్ సురేష్‌కుమార్ పాణిగ్రాహి, టంగరాపుట్టి సర్పంచ్ సవర నవిత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సవర డొంబురు, ఎంపీటీసీ సీర లోకనాథ్, బొడ్డు ఉదయ్‌కుమార్, పార్టీ అధ్యక్షుడు మామిడి తులసయ్య, మాజీ ఎంపీటీసీ మామిడి కృష్ణారావు, బొడ్డు హరికృష్ణ, రెయ్యి కూర్మారావు, తారకేశ్వర రావు, రామారావు, భాస్కరరావు, లోకేష్, సన్యాసిపట్నాయిక్, బృందావన్, బొయిడిక్ రాము తదితరులు పాల్గొన్నారు.

'దేవాలయ భూములు ఆక్రమిస్తే సహించబోం'



ఎండోమెంట్ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించిన అధికారులు

కొత్తూరు: జిల్లాలో ఎండోమెంట్‌కు చెందిన భూములను ఆక్రమిస్తే సహించేది లేదని ఎండోమెంట్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బీవీఆర్‌వీ ప్రసాద్ పట్నాయిక్ అన్నారు. కొత్తూరు మండలం కల్లెమ్మ రెవెన్యూ గ్రూపులోని 199–1లో ఎండోమెంట్ భూమి ఆక్రమించినట్లు ఫిర్యాదు అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు గురువారం అసిస్టెంట్ కమిషనర్ 199–1 లో ఉన్న భూమిని పరిశీలించారు. కల్లెమ్మ గ్రామ సచివాలయం సర్వే గిరి సర్వే ప్రాప్తికి ఎండో మెంట్ భూమికి సంబంధించి ప్రాథమికంగా సరిహద్దులు నిర్ణయించడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 199–1 సర్వే నంబర్‌లో 3.05 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి మొత్తానికి హద్దులు గుర్తించి ఆక్రమణలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈఓ ప్రభాకరరావును ఆదేశించారు.

శ్రీకాకుళంలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

శ్రీకాకుళం క్రైం: ఎన్నికల నేపథ్యంలో టూటౌన్ సీఐ ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణంలోని గొంటి వీధి, కత్తిరివీధి, న్యూకాలనీ, నానుబాలవీధుల్లో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందితో గురువారం ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు.

అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జికి బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తికి కె.శ్రీదేవికి బదిలీ అయ్యింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. ఈమెను తూర్పుగోదావరి జిల్లా కాకినాడ స్పెషల్ కోర్టు ఫర్ పోక్సోకు న్యాయమూర్తిగా నియమించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనాస్థలంలో పడి ఉన్న మృతదేహం

సరుబుజ్జిలి: పెళ్లి కుదిరింది. ముహూర్తం కూడా ఖరారు చేశారు. కానీ అంతలోనే ఆ యువకుడి ఆయుష్షు తీరిపోయింది. ఆలికాం– బత్తిలి ప్రధాన రహదారి రొట్టవలస కేరళ ఇంగ్లిష్ మీడియమ్ స్కూల్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హిరమండలం మండలం రెల్లివలస గ్రామానికి చెందిన కోట శ్రీహరి(25) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. హరితోపాటు మరో యువకుడు పల్సర్ బైక్‌పై పాలవలస గ్రామానికి విందుభోజనాలకు వెళ్లి తన స్వగ్రామం వైపు వెళుతుండగా, ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే శ్రీహరి ఊపిరి వదిలేశాడు. బైక్‌పై వెనుక కూర్చున్న గోక రామకోటికి తీవ్ర గాయాలు కావడంతో 108లో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నిహార్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి రిటైర్డ్ ఫిషరీస్ అధికారి



మంత్రి ధర్మాన సమక్షంలో పార్టీలోకి చేరిన రిటైర్డ్ ఫిషరీష్ అధికారి శాంతారావు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రిటైర్డ్ ఫిషరీష్ అధికారి పుక్కల్ల శాంతారావు చేరారు. ఆయన గురువారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ధర్మాన ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ధర్మాన లాంటి సమర్థవంతమైన నాయకులు జిల్లాలో ఉండడం జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడే తీరుతెన్నులు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయన్నారు.

'పైల వాసుదేవరావు వర్ధంతి జయప్రదం చేయండి'



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: రిట్టపాడులో ఈ నెల 11న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కామ్రేడ్ పైల వాసుదేవరావు 14వ వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు రిట్టపాడులో గల వాసుదేవరావు స్మారక స్థూపం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి గురువారం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వాసుదేవరావు ప్రజా ఉద్యమాలకు ఆకర్షితులై ఉపాధ్యాయ వృత్తిని వదిలి అడవి బాట పట్టారని శ్రీకాకుళం గిరిజన సాయుధ, రైతాంగ పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన పోరాట ప్రతిమ భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

'ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు జరగాలి'



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం ఏపీడీ శైలజ

వజ్రపుకొత్తూరు: ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని, అందుకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ శైలజ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డిక్కల తిరుమలరాజు అధ్యక్షతన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ముఖ్యంగా ఉద్దానం తీర ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు పనులు చేపట్టాలని ఆదేశించారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సూచించారు.

బైక్ ప్రమాదంలో మహిళకు గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక సంతోషిమాత దేవాలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జన్ని సరోజిని అనే స్కూల్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సరోజినమ్మ టెక్కలి అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం ఆమె తన ద్విచక్రవాహనం పై తన ఇంటి నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు వెళ్తుండగా సంతోషిమాత దేవాలయం సమీపంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగరంలోని కామరాజమ్మ కాలనీలో నివాసం ఉంటున్న మూకళ్ల కోటేశ్వరరావు (56) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు ఇచ్చిన వివరాల మేరకు వ్యక్తిగత పనిమీద సింగుపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. జాతీయ రహదారి వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఒక్కసారిగా ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరం.. పర్యాటక హారం

- రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో 67 బీచ్‌ల అభివృద్ధి
- ప్రాధాన్యతగా పనులు చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



ఉద్దాన ప్రాంతంలో అందమైన బీచ్

అరసవల్లి: జిల్లాలో సువిశాల తీర ప్రాంతానికి పర్యాటక సొబగులు చేకూరుతున్నాయి. రాష్ట్రంలో అత్యంత పొడవైన తీర ప్రాంతమున్న మన జిల్లాలో తీర ప్రాంత అభివృద్ధికి గత ప్రభుత్వాలు ఏ మాత్రం చర్యలు చేపట్టలే దు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం జిల్లా తీర ప్రాంతాలకు వరాల జల్లు కురిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో తీర ప్రాంతాల అభివృద్ధికి 2019 లో కేంద్రప్రభుత్వం విడుదల చేసిన కోస్టల్ జోన్ రెగ్యులేషన్ నోటిఫికేషన్‌కు లోబడి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లాలోని పలు బీచ్‌ల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కళ్లేపల్లి, కళింగపట్నంతో పాటు ఒడిషా సరిహద్దులో ఉన్న బారువ, అక్కుపల్లి శివసాగర్ బీచ్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఈమేరకు పర్యాటక శాఖ ఓఅండ్ఎం ప్రాతిపదికన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. మొత్తం జిల్లాలో పర్యాటక కౌన్సిల్ నిర్ణయించిన ప్రకారం మొత్తం 67 బీచ్‌లను అభివృద్ధికి గుర్తించిన సంగతి తెలిసిందే. వీటి అభివృద్ధితో తీరప్రాంతాల్లో చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బందులు లేని రీతిలో పర్యావరణ అనుకూల బీచ్‌లను తీర్చిదిద్దే పనిలో ఉన్నారు.

రాష్ట్రంలోనే అత్యధికంగా...

రాష్ట్రంలో బీచ్‌ల అనుకూల ప్రతికూల అంశాలను పరిగణనలోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందం పర్యటించి రాష్ట్రంలో 12 జిల్లాల్లో 363 బీచ్‌లను గత ఏడాదే గుర్తించింది. ఈమేరకు అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే 67 బీచ్‌లను గుర్తించారు. తర్వాత పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 63 బీచ్‌లు, తర్వాత అనకాపల్లి జిల్లాలో 35 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు నివేదించారు.

జిల్లాలో గుర్తించిన బీచ్‌లు ఇవే... (నియోజకవర్గాల వారీగా)

- శ్రీకాకుళం: కుందువానిపేట, గణగళ్లవానిపేట, బలరాంపురం, కళింగపట్నం, శ్రీకూర్మం(మత్స్యలేశం), మొగదాలపాడు, కొమరివానిపేట, బందరువానిపేట, కె.మత్స్యలేశం.
- ఎచ్చెర్ల: బడివానిపేట, బుడగట్లపాలెం–1, బుడగట్లపాలెం2, డి.మత్స్యలేశం, రాళ్లపేట, కె.మత్స్యలేశం, శివాజీ దిబ్బలపాలెం, కొత్త దిబ్బలపాలెం, పాత దిబ్బలపాలెం, పోతయ్యపాలెం, అల్లివలస, జీడిపాలెం, కొవ్వాడ, చీకటివానిపేట, దోనిపేట, గురయ్యపేట.
- నరసన్నపేట: రాజరామపురం, పెద్దకొవిరిపేట, జోగంపేట, కొత్తరేవు, గొల్లవానిపేట, గుప్పిడిపేట.
- పలాస: మంచినీళ్లపేట, డొంకులపాడు, కంబాలరాయుడుపేట, అక్కుపల్లి, గుణుపల్లి, నువ్వలరేవు, హుకుంపేట, తొట్టూరు, దేవునల్తాడ, కొత్తపేట ఎం.గంగువాడ, గడ్డేరు, బేతాళపురం, రట్టి.
- ఇచ్ఛాపురం: డొంకూరు, బారువ, రామయ్యపట్నం, ఇసుకలపాలెం, బట్టిగల్లూరు, ఎకువూరు, సీహెచ్ గొల్లగండి, కపాసుకుద్ది, పుక్కళ్లపాలెం, కొత్తపాలెం, చిన్నకర్రివానిపాలెం, పెద్దకర్రివానిపేట, ఇద్దివానిపాలెం, కొత్తకళింగపట్నం (ఒంటూరు), బట్టివానిపాలెం.
- టెక్కలి: భావనపాడు, గెద్దలపాడు, ఎం.సున్నాపల్లి, పిట్టవానిపేట, కుందువానిపేట, పాతమేఘవరం, మరువాడ.